# సశేషం

**కె.సభా**

ప్రలలతాకుడులకు చెదరే తుంపరల్లో వుదయించే ఆహ్లాదాన్ని, అస్తమించే భానుడు లోకానికి పసిడి కిరణాల మాలల్ని సమర్పించి విరమిస్తుంటేదృశ్యం లోని సౌందర్యాన్ని తిలకించని దినంగాని,ఆనందాన్ని అనుభవించని సంధ్యగాని, ఏడాదిగా ఆప్రేమోపాసకుల జీవితాల్లో కనబడదు.

తరుణ ప్రవాళలతావితానములు వసంతంలో వెదజల్లే చిరునవ్వు వెలుగుల రక్తిమల్లో జనించిన సౌరభాన్ని ప్రతిజీవికి పంచిపెట్టే వాయుతరంగాలు తమ బాధ్యతను నిర్వహించే తరుణం. చంద్రుని వెండి వెలుగులు ప్రకృతికి హారతులెత్తే అమృత ఘడియలు. హాయిగా...చల్లగా...అందంగా ప్రకృతి విలసిల్లుతోంది.

జైనా ముఖంలో ప్రస్ఫుటించే కాంతి వెల్లువల్ని అమీర్ తిలకిస్తున్నాడు. ఆమె పెదిమల మృదుత్వాన్ని కనుబొమ్మల సోయగాల్ని తదేక ధ్యానంతో పరికిస్తూ ఆయమరాంగన మృదు మధుర సంభాషణల్లో పరితృప్తుడౌతున్నాడు.

ఆప్రేమైక మూర్తుల పవిత్ర స్నేహము పునీతమైన సంబంధము, ద్వేషంతో మూర్ఖుల్తో కూడుకున్న లోకం సహిస్తుందా? అది చరిత్రలో కనబడని వినబడని విషయం కాదూ?

ప్రేమ ప్రవాహం ఆగిపోయింది. సంఘం కట్టిన ఆనకట్ట ఆప్రవాహాన్ని రెండు పాయలుగా చీల్చింది. అది వారి జీవితంలో విషఘడియలు.

జైనా తన గృహంలోనే ఖైదీ అయింది. ఆమె ఘోషా స్త్రీ. ఆమెనుచూచే అదృష్టం అమీరుకు లేకపోయింది. అమీరొక కుట్ర పురుగులా కనబడ్డాడు సంఘానికి. సంఘం దృష్టిలో కుటిలుడు పాపాత్ముడు. సంఘం అతన్ని వెలివేసింది. కన్యల్ని చెరిచే ద్రోహి వ్యభిచారి అని తూలనాడింది. ఇంతకూ అమీరొక పకీరుకొడుకు. దరిద్రంతోనే ప్రారంభమైన అతని జీవితంలో మార్పు యిదివరకు లేదు. అతని ఆస్థి అతని కట్టుబట్టలే. మరి యెలా చదివాడు? లక్షాధికారి పుత్రిక జైనా ప్రేమనెలా సంపాదించాడు? అదంతా ఆలోచిస్తాంటే బహు విచిత్రంగావుంటుంది. ప్రకృతి పరమరహస్యమని సమాధానం చెప్పుకుని తృప్తి పడాలి.

అమీరు జీవితం ఒక పెద్ద కల్లోల కెరటాల సమ్మిళిత సముద్రం ఐపోయింది. నిరుద్యోగం...నిస్సహాయత...ఆకలి...దప్పి...దుర్భర దారిద్ర్యం ... గత్యంతరం...?

దమనశక్తులు విజయంకోసం, బలగాల్ని సమీకరించే సమరదినాలు, కూడూ గుడ్డా దొరుకుతుందనే ఆశతో ఆత్మగౌరవాన్ని చంపుకుని అమీర్ సైన్యంలో చేరిపోయాడు. అన్నపానాలన్నీ సలక్షణంగా కుదిరినై. మనస్సుమాత్రం ఎప్పుడూ ఏదో తప్పుచేస్తున్నట్టు బాధ పడటం అతడికి తెలియకపోలేదు.

రోజూ అతడొకసారి జైనాను తలుచుకుంటాడు. ఆమె ప్రతిబింబాన్ని తన మనీపర్సులో దాచుకున్నాడు. ఆ మధురదినాలు తియ్యని నిమిషాలు ఎంత బాగుంటేవి! ప్రకృతి జోలపాటలతో మేళవించే,పిట్టలమధురగానాల్ని ఆలకిస్తూ మేఘమాలికల్లో చిలుకుతుంటే మీగడలనుండి చెదరేఅమృతసోనలో, హాయిగా పవళించిన ప్రణయ సంఘటనలు, తన హృదయసీమలో యంత్రంలా ఒక్కొక్కటిగా పరుగెత్తుతుంటే తన నేత్రయుగ్మంనుండి కన్నీటికణాలు చిందుతుంటేవి. హృదయం చితికిపోయి ప్రాణంపోతుందేమో అన్నంత బాధకలుగుతుంటేది.

యుద్ధం చేస్తున్నాడు. ఎందుకో ఎవరికోసమో! అతని హృదయంలో ఈ ప్రశ్నకు స్థానం దొరక్కపోలేదు. సమాధానం???

కూటికోటుకు ప్రాణాల్ని తీస్తున్నావని అంతరాత్మ హెచ్చరికలు మాత్రం అపుడపుడూ సంభవమే.

బర్మా యుద్ధరంగంనుండి తన జట్టులో యెందర్నో అనాథలుగా చేసి విడిచిపెట్టింది దొరతనం. కర్తవ్యం?

అగమ్య గోచరం. అయోమయంగా అంధకారంగా భవిష్యత్తు సాక్షాత్కరించింది.

అది సుముహూర్తం. శుభఘడియ. అఖండ భరతఖండానికేగాక యావత్ప్రపంచానికే శుభోదయం. దాస్యశృంఖలాచ్ఛేదనకు రుధిరసంతక ప్రమాణపత్రం వుదయించింది. అపార ప్రజాప్రవాహం రుధిరధారలతో ప్రమాణ పత్రంపై ముద్రలేసింది. అది భయదభయంకర ఘోర ప్రమాణం. అమరదీక్ష. అగ్నిదీక్ష.

ఆ పునీత సైన్యసమితిలో అమీర్ గూడా ఒక్కడైనందుకు, అతనికెంతో తృప్తికలిగింది. చిరకాలంనుండి అతనిలో అణగారి నశించే స్థితికి వచ్చిన స్వాతంత్ర్య కాంతిగోళాలు ఒక్కుమ్మడిగా ప్రభవించి ప్రకాశవంతాలైనై. వేడి నెత్తుటి గుండెలో సమరజ్వాల రగుల్కొంది. అతని ఏకైక వాంఛ భారతదేశ విముక్తి. గమ్యస్థానం ఢిల్లీకోట. అతని ఆశయం నిష్కళంకమైన జన్మహక్కును చాటుతోంది.

సమర మాసన్నమైంది. అమాయకుల నిండు జీవాల్ని బలితీసుకుంటుంటే నిరంకుశ రక్కసి; కదనరంగంలో కదంత్రొక్క నారంభించింది. అంతా భీభత్సం. ఆ భయానక దృశ్యాల్లో అమీర్ తన జీవితానికి మెరుగుపెడుతున్నాడు.

జైనాను మరువలేదు కలం. ఆమె యావద్భారత నారీవర్గానికే ఆదర్శప్రాయురాలు. ప్రపంచ చరిత్రలో యెక్కడా కనీ వినని అసమానమయిన అమోఘమయిన అద్భుత సంఘటనలు సంభవించినై భరతఖండంలో.

మహోన్నత ప్రేమైకమూర్తి ఏసుప్రవక్త, దయామయుడు బుద్ధుడు ఆ యిద్దరి పవిత్రాశయాలు సమ్మిళితమయిన హృదయంలో అకళంక ప్రజాసేవకుడైన మహాత్మునికి బంధిఖానావాస ప్రాప్తి. కోట్లకొలది క్రైస్తవులు డప్పు వాయిస్తూ ఆచరింపలేని ఏసుప్రవక్త సిద్ధాంతాల్ని, ఎన్నోదేశాలు బౌద్ధమతస్థులయిగూడా పెడచెవిని బెట్టిన బుద్ధుని సూత్రాలను ఒక్క మహాత్ముడు, కాంగ్రెస్సూ తప్ప ఎవరాచరించారు? ఎవరాచరిస్తున్నారు?

భావి చరిత్రకు నాయకులైన మహనీయులందరు, బందిఖానాల్లో క్రుంగిపోతున్నారు. దేశమంతా నిరాయుధులు కావటంచేనైతేనేమి మహాత్ముని సిద్ధాంతాల్ని గౌరవించియైతేనేం, అహింసా సిద్ధాంతాన్ని అవలంబించింది. ప్రజానీకం రక్తంలో మునిగింది. తన సంపదలను, బిడ్డల్ని బలిచేసింది. దమన శక్తుల విజృంభణకు సరిహద్దుల్లేకపోయినై. అస్వతంత్ర మానవకోటి ఆర్తనాదాలు మిన్ను ముట్టినై.

జలదాల్ని చుంబించే మేడల్లో ధనలక్ష్మి కౌగిలింతల్లో నిదురించే సంపన్నులకు వీటితో ఏంపని వుంటుంది? జైనాతండ్రి ప్రభుత్వంతో చేతులు కలిపాడు. ఈ విషయం జైనాకు తెలిశాక ఆమె గుండెల్లో మంటలెగసినై. విద్యావతికి సమస్త ప్రపంచం తెలిసేవుంటుందిగా! ఆమెలో జాతీయత నశించలేదు. పైగా అమీర్ మిలిటరీలో చేరాడని విన్నాక అతన్ని అసహ్యించుకుంది. ఆ పవిత్రప్రేమ ద్వేషంగానే మారిపోయింది. ప్రపంచంపై ఓవిధమయిన అసూయ అవిశ్వాసం జనించింది.

దేశం దుర్భిక్షంలో మండిపోతూ లక్షలకొద్దీ ప్రజలు ఆకటిచిచ్చులో మాడిపోతుంటే సైన్యాలెక్కడికో సమీకరించబడుతున్నై. ప్రజాసేవకులు ప్రాణాలు బలిగావిస్తూ జైళ్లలో కాపురంపెట్టారు. దేశం యేంమయ్యేట్టు? ఈ ప్రశ్న జైనా సున్నిత హృదయానికి అంకుశపుపోటు.

ఆమె ఘోషా. ఎందుకో! ఆమె నిస్సహాయత, పిరికితనంచేతనే. ఆమె ఆలాగే భావించింది. తన భవనంనుండి బాహ్య ప్రపంచంలోనికి ప్రవేశించింది. ఇంతవరకూ పత్రికల్లో చదివే వార్తల యదార్థ స్వరూపాల్ని కళ్లారచూచింది. ఆమె కడుపు మండిపోయింది. కన్నీళ్లు కెరటాలైనై. దగ్ధమాతుంటే హృదయంతో ఆమె కఠోరదీక్ష వహించింది.

స్వాతంత్ర్యంకోసం పేదలకోసం నాజీవితాన్ని త్యాగంచేస్తాను. స్వాతంత్ర్యం లభించేవరకు నా జీవితంలో మార్పుతీసుకరాను. కన్యగానే నా కాలాన్ని వెళ్లబ్బుతాను.

ఆమె మనోనిశ్చయానికి ప్రకృతి జలదరించింది.

స్వాతంత్ర్య యోధులు నడచే ముళ్లబాటలో పయనించింది. ప్రారంభంలోనే అబల అలసిపోతుందనే కనికరంతో కామోను, నిరంకుశం ఆమెనొక చీకటికొట్లో విశ్రాంతి తీసుకొమ్మని ఆజ్ఞాపించింది. జైనా జీవితం అంధకారబంధురమయి నాలుగుగోడల మధ్య నలిగిపోతూవుంది. విరిసి సౌరభాన్ని వెదజల్లే తరుణంలో పుష్పం మళ్లీ ముకుళించి మొగ్గరూపందాల్చింది.

అన్ని ఇంకులలోనూ శ్రేష్ఠమైనది

మధుర, అఖిల భారత చేతిపని వస్తు ప్రదర్శనములలో స్వర్ణపతకము పొందిన

వీయన్స్ ఇంకు

పౌంటెన్ పేనాలకూ, సాధారణ పేనాలకూ ఉపయోగించుటకు అతి శ్రేష్ఠమైనవి

*For Particulars:*

**WEEYANS INK WORKS**

Factory: 112 Palace Road, MADURA.

* * *

అమీరు కట్టుకున్న ఆకాశహర్మ్యాల పునాదులు సడల నారంభించినై. అతడు ఖైదీ అయిపోయాడు. అందరితోపాటు పరిస్థితులకు కట్టుబడ్డాడు.

జైనా యింకా బందిఖానాలోనే మ్రగ్గుతూ వుంది.

అమీరు చెరసాలలో కృశించి పోతున్నాడు.

జైనా ధనవంతుడి కూతురు కాబట్టి యేనాడో తన విషయాన్ని మరచి పెళ్లిచేసుకొని వుంటుందని, స్వాతంత్ర్యం సాధించేవరకూ, బ్రహ్మచారిగావుండుటయే తన కర్తవ్యమనీ అమీర్ నిర్ణయించుకున్నాడు.

పీడిత ప్రజాలోకానికి ద్రోహంచేసి దమనశక్తితో చేతులుకలిపి అమీరుచేసిన ద్రోహానికి ప్రతీకారంగా స్వాతంత్ర్య సమరంచేస్తూ కన్యగా జీవితశేషాన్ని గడపటానికే, జైనా నిర్ణయించుకుంది. ఈ నిర్ణయం అమీరు స్వతంత్ర సైన్యంలో చేరాడని తెలిసివుంటే జరగటానికేమాత్రం వీలులేకుండేదేమో!

ఆ ఇరువురి జీవితాలు, ఏనాటేకమౌతాయో! ఆ శుభసమయం ఎప్పుడో! అలాంటి పవిత్రమూర్తులీ దేశంలో యెందరున్నారో! అగమ్యగోచరం. భవిష్యత్తు అంధకారమే గదూ? మరి వారి విమోచనమేనాటికి???? ఆ వెలుగుక్షణం వరకూ, ఆ అమరజీవుల పవిత్రగాథ సశేషంగానే వుంటుంది.